క్లుప్తంగా

దేశ శ్రేయస్సుకు అనఘాష్టమి వ్రతం


అనఘాష్టమి వ్రతం చేస్తున్న నంద్యాల సీతారామయ్య దంపతులు

ఆకివీడు: దేశం సుభిక్షం కోసం, శ్రేయస్సుకు అనఘాష్టమి వ్రతాన్ని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య దంపతులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల సిద్ధులు అనుగ్రహించేది అనఘాష్టమి అని ఆయన అన్నారు. మార్గశిర మాసంలో కృష్ణ పక్షంలో అష్టమి రోజు అనఘాదేవి వ్రతం చేయడం ద్వారా ముక్తి లభిస్తుందన్నారు. అవధూత దత్త పీఠాధిపతి శ్రీగణపతి సచ్చిదానంద స్వామీజీ అనుగ్రహంతో వ్రతం నిర్వహించినట్లు చెప్పారు.

ఆదిత్య స్కూల్‌లో రైతు దినోత్సవం


రైతుల వేషధారణలో విద్యార్థులు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని ఆదిత్య స్కూల్లో సోమవారం జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ కృష్ణంరాజు తెలిపారు. 5వ మాజీ ప్రధాని చౌదరి చరణ్ సింగ్ జయంతి జ్ఞాపకార్థం డిసెంబర్ 23ను జాతీయ రైతు దినోత్సవంగా నిర్వహిస్తారన్నారు. దేశంలోని అందరి ఆకలి తీర్చే రైతన్నను అందరూ గౌరవించాలన్నారు. విద్యార్థులు రైతుల వేషధారణలో అలంరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, కె.వి. సత్యనారాయణ, ఎ.వి.ఎల్ దుర్గాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధనుర్మాసం.. అతి పవిత్రం


మాట్లాడుతున్న శ్రీత్రిదండి రామచంద్ర రామానుజ జీయర్

భీమవరం(ప్రకాశంచౌక్): ధనుర్మాసం అతి పవిత్రమైనదని, మోక్ష సాధనకు భగవన్నామ స్మరణ ఒక్కటే శరణ్యమని శ్రీత్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ అన్నారు. ఈ సందర్భంగా శ్రీత్రిదండి రామచంద్ర రామానుజ జీయర్ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని, నిరంతరం భగవన్నామ స్మరణ మోక్ష సాధన అని, ధనుర్మాస ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం 150 మంది భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఠం సభ్యులు కారుమూరి చినబాబు, చెరుకువాడ రంగసాయి, టీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


అమ్మవారి ఆలయంలో విరాళం అందజేస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి శాశ్వత నిత్యాన్నదానానికి ఉండి నియోజకవర్గానికి చెందిన మార్నెళ్ల నరసింహరావు భార్య రుక్మిణి నాగకామేశ్వరి, కుమార్తె కమల గాయత్రీలు రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

యలమంచిలి: మండలంలోని ఏనుగువానిలంక హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామ మాజీ సర్పంచ్ వినుకొండ రవి, ఎంపీటీసీ సభ్యురాలు ధనలక్ష్మి సోమవారం అందజేశారు. గత ఏడేళ్లుగా వినుకొండ రవి దంపతుల ఆర్థిక సాయంతో ఈ స్టడీ మెటీరియల్ విద్యార్థులకు అందిస్తున్నట్టు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయులు శ్రమకోర్చి ప్రతి ఏటా ఈ మెటీరియల్ తయారు చేయడం ప్రశంసనీయమన్నారు. విద్యార్థులు ఈ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. సర్పంచ్ ఈద ప్రమీల సువర్ణరాజు, ప్రధానోపాధ్యాయులు అవధాని, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ నారిన వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మండలాలకు క్యూ కట్టాల్సిందేనా ?

- గ్రామ సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం
- గత ప్రభుత్వ హయాంలో ప్రజలకు మెరుగైన సేవలు
- నీరు గారుతున్న బాపూజీ కలలు కన్న స్వరాజ్యం
- వెలవెలబోతున్న కార్యాలయాలు.. అయోమయంలో ప్రజలు


గ్రామ సచివాలయ సముదాయం


సిబ్బంది లేక వెలవెలబోతున్న కుప్పనపూడి సచివాలయం

ఆకివీడు: ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి, సేవలకు మళ్లీ మండల కేంద్రాలకు క్యూ కట్టాల్సిందేనా అంటే పరిస్థితి అలానే కనిపిస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ శాఖల, సంక్షేమ సేవలను ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. దీంతో మహాత్మా గాంధీ ఆశయ సాధనలో ఏర్పడిన సచివాలయ వ్యవస్థ నేడు నీరుగారుతుంది. గ్రామాలు స్వయం సమృద్ధి, స్వయం ప్రతిపత్తి గల సంస్థలుగా రూపుదిద్దుకునేందుకు ఏర్పడిన సచివాలయాలు నేడు బోసిపోతున్నాయి. ఒక్కో సచివాలయంలో 12 మంది సిబ్బందిని ఏర్పాటు చేసి, ఆయా రంగాల్లో ప్రజలకు ఇంటి ముంగిటే సేవలందించేందుకు గత ప్రభుత్వం ఈ వ్యవస్థను అమలులోకి తీసుకొచ్చింది. గత ఆరు నెలల నుంచి సచివాలయాల్లో తగినంత మంది సిబ్బంది లేక ప్రజా సేవలు కుంటుపడుతున్నాయి. సచివాలయాల ద్వారా ప్రజలకు 650 రకాల సేవలందించేందుకు నిర్ణయం తీసుకుని ఆ దిశగా సేవలను ప్రజలకు అందజేసేవారు. ఆ ప్రకారం గత నాలుగేళ్లుగా సచివాలయాల ద్వారా ప్రజలకు విస్తృత సేవలందాయి. ఉండి నియోజకవర్గంలోని ఏ సచివాలయానికి వెళ్లినా అరకొర సిబ్బందితో దర్శనమిస్తున్నాయి. సచివాలయ కార్యాలయంతో పాటు రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్‌లు వెలవెలబోతున్నాయి. కొన్ని చోట్ల తలుపులు కూడా తెరుచుకోని పరిస్థితి నెలకొంది.

నియోజకవర్గంలో 73 సచివాలయాలు

ఉండి నియోజకవర్గంలో 73 సచివాలయాల్లో సుమారు 741 మంది ఉద్యోగులకు గానూ 541 మంది ఉద్యోగులున్నారు. కొన్ని సచివాలయాల్లో సిబ్బంది ఇతర సచివాలయాల్లో ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. మరి కొంతమంది బదిలీలు, లీవులపై వెళ్లారు. శాఖాపరమైన సర్దుబాట్లతో మరి కొంతమంది మాతృ శాఖల్లో పని చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ వచ్చిన తరువాత లబ్ధిదారులకు, ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ప్రజలు వాపోతున్నారు.

ప్రజల ముంగిటే సేవలు

సచివాలయ వ్యవస్థ ద్వారా గత ప్రభుత్వ హయాంలో ప్రజల ముంగిటే సేవలందించేవారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటివి త్వరితగతిన పూర్తయ్యేవి. దీంతో ప్రజలు మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం ఉండేది కాదు.

జిల్లా కేంద్రానికి ఫిర్యాదుల వెల్లువ

సచివాలయ వ్యవస్థ కుంటుపడిందనడానికి నిదర్శనంగా ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు మార్గం లేక, జిల్లా కేంద్ర కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ప్రజా ఫిర్యాదుల వేదిక జిల్లా కేంద్రం ప్రతీ సోమవారం కిటకిటలాడుతుందంటున్నారు. స్థానిక సమస్యలను కూడా ప్రజలు జిల్లా కేంద్రాలకు వెళ్లి చెప్పుకోవలసిన పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. మండల కేంద్రాల్లో జరిగే గ్రీవెన్స్‌సెల్‌లో ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారం కన్నా వాటిపై ఒత్తిడి పెరిగిపోయి, సమస్య పరిష్కారం కాకుండానే, పరిష్కారమైనట్లుగా సంతకాలు సేకరించి రశీదులిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

మండలం సచివాలయాలు:

మొత్తం సిబ్బంది		పని చేస్తున్న వారు	
ఆకివీడు	12	120	92
కాళ్ల	21	210	164
ఉండి	22	231	153
పాలకోడేరు	18	180	132

జనావాసాల మధ్య చెరువులకు అనుమతులు ఇవ్వొద్దు


కాళ్ల తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న కాలనీ వాసులు

కాళ్ల: జనావాసాల మధ్య చెరువులకు అనుమతులు ఇవ్వొద్దని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జగనన్న కాలనీ వాసులు సోమవారం ఫిర్యాదు చేశారు. పెదపాటి దిబ్బ ఏరియాలో జగనన్న కాలనీలో నివసిస్తున్న సుమారు 120 కుటుంబాలు జీవిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికీ ఈ కాలనీకి దక్షిణం, ఉత్తరం వైపున ఆక్వాచెరువులు ఉండడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం కాలనీకి పడమర వైపు ఉన్న పొలాలను చెరువులుగా చేసేందుకు కొంత మంది ఆక్వా రైతులు ప్రయత్నం చేస్తున్నారని, అనుమతులు ఇస్తే తామంతా కాలనీని ఖాళీ చేసి రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. ఇప్పటికే రోడ్డు పక్కన నివాసాలు ఉన్న తమ ఇళ్లను తొలగించడంతో రోడ్డున పడి తీవ్ర మానసిక క్షోభకు గురయ్యామని, ఇప్పుడు కాలనీకి ఆనుకొని ఆక్వా చెరువులు తవ్వితే వాటి ద్వారా వచ్చే కాలుష్యం వల్ల తామంతా అనారోగ్యానికి గురవుతామన్నారు. సదరు శాఖల ఉన్నత అధికారులు స్పందించి ఆక్వా చెరువుల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయకుండా చూడాలని కోరారు.

క్రీడాకారులకు అభినందనలు


నెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఈ నెల 25వ తేది నుంచి 28వ తేదీ వరకు ఛత్తీస్‌గడ్ రాష్ట్రం కోర్బాలో జరిగే 68వ జాతీయ స్థాయి నెట్ బాల్ అండర్ -19 పోటీలకు భీమవరం డాక్టర్ సీఎస్ఎన్ విద్యార్థులు ఫణీంద్ర కుమార్, టి. కేశవ మణికంఠలు ఎంపికయ్యారని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సలీంఖాన్ తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19నెట్ బాల్ పోటీల్లో పశ్చిమగోదావరి జిల్లా బాలుర జట్టు ప్రథమస్థానం సాధించినట్లు తెలిపారు. సీఎస్ఎన్ కళాశాల నుంచి ఇద్దరూ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ దావూద్‌ఖాన్ తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులని భీమవరం డాక్టర్ సీఎస్ఎన్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ చీడే సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపల్ ఎండి సలీం ఖాన్ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

వేణుగోపాలస్వామికి ధనుర్మాస పూజలు



తిరుప్పావై పాశురం చదువుతున్న మహిళలు, ప్రత్యేక అలంకరణలో వేణుగోపాలస్వామి →

ఆకివీడు: స్థానిక రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్లకు ధనుర్మాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పులిహోర, దద్దోజనం, కట్టు పొంగలి, చక్ర పొంగలి, చిట్టి అప్పడాల ప్రసాదాల నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో రాజేశ్వరి అక్కయ్య ఆధ్వర్యంలో రోజుకొకటి చొప్పున తిరుప్పావై పాశురాలు గానం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదాదేవి విష్ణు మూర్తి అవతారాల్ని, చిత్త శుద్ధితో భగవంతుడ్ని ప్రార్థించడం ద్వారా స్వామి కృప లభిస్తుందని తిరుప్పావై పాశురాల ద్వారా ప్రజలకు తెలియజేస్తారని చెప్పారు. అర్చకులు శేషాచార్యుల ఆధ్వర్యంలో ధనుర్మాస పూజలు వైభవంగా నిర్వహిస్తున్నారు.

సర్వే నంబర్ ప్రకారం బీమా చెల్లించాలి


రైతులకు సూచిస్తున్న ఏఓ ప్రియాంక

ఆకివీడు: పంటల బీమా సౌకర్యాన్ని సర్వే నంబర్ ఆధారంగా నిర్ధారణ చేయాలని ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు ప్రభుత్వానికి సూచించారు. పంటల బీమా ప్రీమియం చెల్లింపుపై సోమవారం కుప్పనపూడి సచివాలయంలో నిర్వహించిన రైతు సమావేశానికి ఏఓ ప్రియాంక అధ్యక్షత వహించారు. రైతు చల్లారావు మాట్లాడుతూ ప్రీమియం రైతే చెల్లిస్తున్నందున సర్వే నెంబర్ ఆధారంగా అయితేనే రైతుకు మేలు కలుగుతుందన్నారు. ఇన్స్యూరెన్స్ వ్యాపారంగా మారిపోయిందని, గ్రామం, మండల యూనిట్ వల్ల రైతుకు ఉపయోగం లేదన్నారు. నష్టపోయిన ప్రాంతాన్ని వదిలివేసి, ఓవరాల్ సర్వే పేరుతో గ్రామంలోని నాలుగు ప్రాంతాలను ఎంపిక చేసి నష్టం అంచనాలను వేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రైతులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి ఉన్నతికి గణితశాస్త్రం కీలకం


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్ఆర్‌కేఆర్ కళాశాల ప్రతినిధులు

కాళ్ల: ప్రతీ విద్యార్థి ఏ రంగంలో ప్రగతి సాధించాలన్నా గణితశాస్త్రంలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ జీఎన్‌వీ కిషోర్ అన్నారు. కళాశాల ఉన్నత భారత్ అభియాన్ (యూబీఏ) ఆధ్వర్యంలో కాళ్లకూరు ఉన్నత పాఠశాలలో గణితశాస్త్ర మేధావి శ్రీనివాస్ రామానుజన్ జయంతోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ జీవిత చరిత్ర దైనందిన జీవితంలో గణిత ప్రాముఖ్యత గురించి వివరించారు. విద్యార్థులకు రామానుజన్ పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, యూబీఏ కో-ఆర్డినేటర్ కేఎం గణేష్, జి.సూరిబాబు పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో తహసీల్దార్ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నడింపల్లి భారతీ విజయలక్ష్మి

పాలకోడేరు: నిత్యావసర సరుకులు అందలేదని ఏ ఒక్క కార్డుదారుడి నుంచి ఫిర్యాదులు రాకూడదని పాలకోడేరు తహసీల్దార్ భారతీ విజయలక్ష్మి స్పష్టం చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రేషన్ డీలర్లు, ఆపరేటర్లు అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ ఆది శేషయ్య, మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు దొంగ కృష్ణ, సెక్రెటరీ సాయికృష్ణ, ఎస్.పద్మజ శ్రీనివాస్, ఎస్ఎన్‌వీ కృష్ణవేణి, దుర్గా సుజాత, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

భద్రత కోసమే శిరస్త్రాణం


హెల్మెట్ అవగాహన పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ నాయిమ్ అస్మి

భీమవరం(ప్రకాశంచౌక్): భద్రత కోసమే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించాలని ఎస్పీ నయిమ్ అస్మి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ కార్యాలయంలో హెల్మెట్ అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించి సురక్షితంగా ఉండాలన్నారు. హెల్మెట్ ధరించడంపై ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సహకారంతో ఈ ప్రచార అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామని, అందరూ ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ దేశంశెట్టి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి


కొణితివాడ హైస్కూల్లో విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు అయిన సందర్భంగా కొణితివాడ హైస్కూల్లో రాజ్యాంగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫ్లాగ్ టవర్ నిర్మాత వడ్డి సుబ్బారావు ఆధ్వర్యంలో కొణితివాడ ప్రధాన ఉపాధ్యాయుడు ఎం.రామకృష్ణ భారత రాజ్యాంగం పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని, భారత రాజ్యాంగం ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకుంటే ఫిర్యాదు చేయండి


వృద్ధురాలి సమస్యలు వింటున్న ఆర్డీఓ రాజు

నరసాపురం: ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో అధికారులు స్పందించకపోతే తనకు ఫిర్యాదు చేయాలని ఆర్డీఓ దాసి రాజు సూచించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 34 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రజా సమస్యల తక్షణ పరిష్కారమే మీకోసం లక్ష్యమన్నారు. ప్రజా ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వీటిపై ఎప్పటికప్పుడు తనకు నివేదిక ఇవ్వాలని ఆర్డీఓ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారులు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం


భీమవరం (ప్రకాశంచౌక్): సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): ఏసు క్రీస్తు బోధించిన ప్రేమ, త్యాగం, దయ మార్గాలు అనుసరణీయమని జిల్లా పౌర సంబంధాల అధికారి టి.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలోని జిల్లా సమాచార శాఖ కార్యాలయం నందు సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఆర్వో టి.నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ చాలా ప్రత్యేకమైనదన్నారు. క్రీస్తు వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. ముందుగా రికార్డ్ అసిస్టెంట్ దేవరకొండ సోమరాజుతో కేకును కట్ చేయించి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలలో సీనియర్ అసిస్టెంట్ కె సత్యనారాయణ రాజు, పబ్లిసిటీ అసిస్టెంటు చించిలి శ్రీనివాస నెహ్రూ, రికార్డు అసిస్టెంట్ దేవరకొండ సోమరాజు, ఫోటోగ్రాఫర్ పి.వై రత్నాకర్, పి.వీరభద్రం పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రిస్మస్ సందడి

కాళ్ల: గ్రామాల్లో క్రిస్మస్ సందడి నెలకొంది. ఈ నెల 25వ తేదీన క్రిస్మస్ పండుగ పురస్కరించుకొని గ్రామాల్లో చర్చిలు విద్యుత్ కాంతులతో మిరిమిట్లు గొలుపుతున్నాయి. కొన్ని గ్రామాల్లో చర్చిలకు ప్రత్యేకంగా విద్యుత్ అలంకరణ చేశారు. ప్రధానంగా కాళ్ల మండలంలో ప్రొత్తాళ్లమెరక, జువ్వలపాలెం, పెదఅమిరం, కాళ్ల గ్రామాల్లో చర్చిలకు ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు అందర్నీ ఆకర్షిస్తున్నాయి.


కాళ్ల: విద్యుత్ కాంతులతో అలంకరించిన జువ్వలపాలెం చర్చి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాళ్ల: మండలంలోని జక్కరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్ ఏర్పాటు పనులు మంగళవారం చేపట్టనున్నారు. ఈ మరమ్మతుల నిమిత్తం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు బొండాడ, బొండాడపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్. వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఆకివీడు: మండలంలోని ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని పీఆర్‌టీయూ మండల శాఖ ఎంఈఓ సీతారామయ్యకు సోమవారం వినతి పత్రం అందజేశారు. సంవత్సరకాల ఇంక్రిమెంట్ వ్యక్తిగతంగా చెల్లించాలని, ఓపీఎస్ ఉపాధ్యాయులకు పీఎఫ్ బ్యాలెన్స్ చెక్కులు అందరికీ ఇవ్వాలని, ఎన్నికల విధులు నిర్వహించిన వారికి 2023, 24లో టెన్త్, అపాస్ పరీక్షలకు విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్‌లో ఈఎల్‌లు నమోదు చేసి, మంజూరు చేయాలని అధ్యక్ష, కార్యదర్శులు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కాళ్ల: సమస్యలు పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.సుందర్‌సింగ్ అన్నారు. కాళ్ల మండలం సీసలి పంచాయతీ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముందు గ్రామంలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిర్వహించిన సదస్సులో బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. గ్రామానికి సంబంధించి ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు తహసీల్దార్ సుందర్‌సింగ్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ప్రవీణ్‌వర్మ, ఆర్ఐ లక్ష్మీకిరణ్, వీఆర్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తి అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. బలరామరాజు తన సిబ్బందితో ఎల్‌వీఎన్‌పురంలో బెల్ట్ షాపుపై దాడులు చేశారు. బెల్ట్ షాపు నిర్వహిస్తున్న పాలా గణపతిని అదుపులోకి తీసుకుని ఆయన వద్ద నుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. మండలంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు పీవీవీఎస్ ఉమా మహేశ్వరరావు, పి. సునీల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వెంకట్రామయ్య సేవలు మరువలేనివి


నాచు వెంకట్రామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): నాచు వెంకట్రామయ్య సేవలు మరువలేనివని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. సోమవారం పట్టణంలో నాచు వెంకట్రామయ్య వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

మొగల్తూరు: మొగల్తూరులోని కరికాల వర్గానికి చెందిన విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సోమవారం ఆ వర్గానికి చెందిన నాయకులు ఆర్థిక సాయం అందించారు. డిగ్రీ విద్యార్థులకు రూ.5 వేలు, ఇంజినీరింగ్ విద్యార్థులకు రూ.8 వేలు, వైద్య విద్యార్థులకు రూ.25 వేలు చొప్పున 20 మందికి, అనారోగ్యంతో బాధపడుతున్న 10 మందికి రూ.5 వేలు చొప్పున సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కామాడి లక్ష్మణరావు, కేపీఎన్ ముక్తేశ్వరరావు, పినిశెట్టి మల్లికార్జున రావు, పాలాటి బాలయోగి, బీబీకే శివన్నారాయణ, ఎం కాశీ విశ్వేశ్వరరావు, కర్శెళ్ల బాబు వీరభద్ర ప్రసాద్, సాయిబాబు పాల్గొన్నారు.